

జట్టి

అర్జునుడూ, గురుసామి మేకలు తోలుకుని డొంకదారిగుండా బొంతలగుట్ట నెక్కుతున్నారు. బొంతలగుట్ట నావరించి వున్న ప్రకృతి సమస్తం నిశ్శబ్దంగా వుంది. ఎండ నిర్దయగా కాస్తూ వుంది.

అర్జునుడు వొకబండ చివరికి వచ్చి టీగల కోనలోకి చూపు సారించాడు. ఎండ కొట్టకుండా ఎడమ చేయి నుదురు కానించుకుని కుడిచేతి చూపుడు వేలుతో కనుచూపు మేరనంతా గాలిలో గిరిగీసి చూపుతూ –

''ఏమి ఎండ కాస్తావుందో సూడు. మూగి ఎండ. నిరుడు చిత్రి, వొయ్యాసి నెలల్లో కాసిన ఎండ యిప్పుడే కాసేస్తా వుంది. ఏడేగానీ కాకి ఐనా నీడ ఎలబారతావుందేమో సూడరా'' అన్నాడు.

''నీకూ, నాకూ దప్పితే అవిటికేం గాచ్చారం పట్టింది యిట్టాటి ఎండలో దిరిగి సచ్చేదానికి. ఊరి ముందర చింతమాకుల్లో, టెంకాయ సెట్టల్లో కూసోని ఈ మిద్దెకల్లా, ఆ మిద్దెకల్లా గుడ్లార్పతా వుంటే సాలు – పొద్దు పొయ్యేకాడికి వొక్కక్కటి బొంత గద్ద మాదిరి బలిసిపోతా వుండాయి. దీపాలు బెడ్తారనంగా ఊరినాలుగు సుట్లా అవిటిరంపు ఏం సెప్పతరంగాదు'' అన్నాడు గురుసామి.

అర్జునుడు ముతక గాడాతో కుట్టిన బనీను తొడుక్కొని వున్నాడు. నాలుగు మూళ్ళ పంచను గోచీ మాదిరిగా కట్టుకున్నాడు. అతని తలపాగా మాసి గోధుమ రంగులో వుంది. అతని చంకకు ఒక చిక్కం ఒక పారామిలట్రీ వాటర్ బాటిల్ వ్రేలాడుతూ

వున్నాయి. చిక్కంలో రెండు ముద్దల సంగటి. రొండిలో అరకట్ట బీడీలు. అగ్గిపెట్టె సున్నపుకాయా వున్నాయి చేతిలో పొడవైన కొంకిదోటి వుంది. పళ్ళు ఎర్రగా గారకట్టి ఉన్నాయి. ముఖం ముడతలు దేరి వుంది.

అతడు నిలుచున్న బండ క్రిందనే గురుసామి నిలుచుకొని వున్నాడు. బలిష్టమైన దేహం, నల్లని ఛాయ. వయస్సు యిర్వై మించదు. వేసుకొన్న చొక్కా మోకాళ్ళ వరకూ వ్యాపించి కట్టుకొన్న పంచను కన్పించనీయడం లేదు. వీపులో చొక్కా పర్రలు పర్రలుగా చీలి వుంది. మెడవరకు పెరిగిన జుట్టును ఆముదం రాసి వెనక్కు దువ్వుకుని వున్నాడు. చిక్కంలో రెండున్నర ముద్ద సంగటి అంటవేసిన చొక్కా జేబులో నాలుగైదు బీడీలు, అగ్గిపెట్టె, కరుకూ వున్నాయి.

గురుసామి చెవిలోనుంచీ సగం కాలిన బీడీని తీసి వెలిగించుకొని అగ్గిపుల్లను ప్రక్కనున్న బోదపైకి విసిరేశాడు. బోద భగ్గున మండుకుంది. టీగల కోన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పన్నెండు గంటల ప్యాసింజరు అరగంట లేటుగా పోతూ వుంది. సరిగా ఆ సమయానికి వారు గుండాల మిట్ట దగ్గర బొంతలగుట్ట నధిరోహించి నాగపట్ల కనుమలోకి దిగసాగారు.

''మిడికాళ్ళు తొక్కతా రాకపోతే ముందుకు పొయ్యి జీవాల్ని అదిలిస్తే ఏమిరా? కోనలో కొచ్చింది నువ్వు మనిషి తోడుబెట్టుకోని షికారు తిరగనా? మంగలోడి దోనెకాడ కూచ్చొని రెండు జావులు సంగటి దినేదానికి తప్పించి నెలనాళ్లుగా నయాపైసా పని ఏమి సేస్తావుండావు నీవు. మీ నాయన గూడ వుండె! కోనలో కొస్తే రెండు కాళ్ళూ ఒక సోట పెట్టేవోడుగాదు. కూత ఏసినాడంటే ఇట్ల మొగదల కోన మొదలుకోని అట్ల నేరేడుమాను సెలమ దాకా - యిట్ల గుండాలమిట్ట కాన్నించి అట్ల నక్కలబండ దాకా ఏడున్న జీవాలూ అరచనంలో చుట్టూరా చేరిపోయేటివి. తోడేళ్ళూ, పెద్ద నక్కలూ మీ నాయనకు ఉచ్చ బోసుకునేటివి. మల్లా జెప్తావుండా పెద్ద నక్కొకటి జేరుండాది. అదో ఆ నల్ల మేక ముందర పోతా వుండే ఎర్రమరక. అంతమాత్రమూ బాగా బలిసుండాది. దాని తోక మాత్రము నా మూరతో ఒకటిన్నర మూర వుంటాది. ముక్కు కాన్నించి వెనిక్కాళ్ళదాకా నల్లంగా బట్లుబట్లుగా వుంటాది. మొన్న నాగులుగాడి చుక్కల మేకను మింగేసింది. ఆవునట్టా దాన్ని అలగ్గా గొంతు కొరికేస్తాది. బద్దరం! బద్దరం! ఒళ్ళులో బయిం పెట్టుకోని మేపుకున్నావంటే ఈ పొద్దు ఒక పుడ్డ జీవాలు రేపు రెండు పుడ్లవుతాయి. ఈ మాదిరిగా చిక్కంకల్లా, పొద్దుకల్లా జూసుకుంటా

వున్నావంటే దినానికి ఒకటి లెక్కన ఆ బల్లదానికి పలారం పెట్టేసి నాక్కొనిబోతావు...''
నాలుకతో నోరు చుట్టి నములుతున్న వక్కాకును తుపుక్కున వుమ్మేశాడు అర్జునుడు.

''ఆ ఎర్రపిల్ల అంత వుండదంటావు. ఆవుగొడ్డు అట్టాదాన్ని గొంతు కొరికేస్తాదంటా వుండావు. ఏం నువ్వు జెప్పేది? ఏమీ నమ్మేటిదిగా వుండ్లే...'' అర్జునుడి వైపు అనుమానంగా చూశాడు గురుసామి.

''ఓరినీ, నీ వొయిసంతా కలిపితే నేను ఈ నాగపట్ల కనుమలో తిరిగిన సర్వీసులో సగం వుంటుందా? అప్పిటికి నీకు నేను జల్లి చెప్తావుండా ననుకుంటా వుండావా? పెద్ద నక్కంటే నువ్వు మీ అటకమీది తిరిగే నల్లపిల్లి అనుకోనుండావా? మదులు గోడలకింద దిరిగే ఊరకుక్క అనుకోనుండావా? పెద్ద నక్కకుండే నేకు కుందేలీకీ లేదు. కుర్ర పందికీ లేదు. అది కంపసెట్లల్లో ఆవులు పొయ్యే దారుల్లో మంచి బలమైన చెట్టు మొద్దుల్ని తోకతో పడేసి పట్టుకోని ఏం తెలియంది మాదిరిగా దాంకోని వుంటాది. గొడ్డు ఆ దోవను రాంగానే ఎనిక్కాలు ఏసేస్తాది. ఎప్పుడైతే ఆవు ముందరికీడస్తాదో బాగా ఈడవనిచ్చి కాలు యిడిప్పిచ్చేస్తాది. ఆ దెబ్బతో ఆవు యిసరకబొయ్యిపడిపోతాది. అంతే ఇది దానిమీద పడి గొంతు కొరికేస్తాది.. అయితే నువ్వేమీ దానికి బయపడబండ్లె. అదంటే నీకెంత బయమో దానికి నువ్వంటే అంతకంత భయము. నక్క దగ్గరగా బెదరద్దు. బెదిర్తే అది మనిషి మీదనే దూకేసును. కత్తితో మారినావంటే ఆ పక్క రెండు మైళ్ళే అయిపుండదు...'' ధైర్యం జెప్పుతూ నవ్వసాగాడు అర్జునుడు.

గురుసామి కణతలమీద జారిన అముదాన్ని తుడుచుకుంటూ తన ఎత్తు పళ్ళన్నీ కన్పించేట్టుగా నవ్వాడు. నడుస్తూ వున్న గురుసామి ఉత్తరంగా కోనలోకి చూపు సారించి చటుక్కున నిల్చిపోయాడు.

''ఏం రా! కరెంటు కొట్టేసినట్టుగా మాను అయిపోయినావు. ఏవి కనపడతా వుంది నీకు యిచిత్తరం'' అర్జునుడు గురుసామి చూస్తున్నవైపు చూపు సారించాడు. పచ్చని చెట్ల నడుమ ఒక స్త్రీ వడివడిగా నడిచిపోతూ వుంది. ఆమె కట్టుకున్న ఎర్రచీర ఎక్కడున్నా, ఆమెను ఎత్తి చూపుతోంది.

''ఏవి ఆడదాన్నెప్పుడూ సూడ్లె. దిగు దిగు. మేకలకూ నాకూ గూడా నోరెండుకొని బోతా వుండాది'' అర్జునుడు గురుసామిని దాటుకుని ముందుకు వెళ్ళసాగాడు.

''ఎవురా మనిషి, దినామూ యిదే యాళకు నారవదాటుకోని బోతావుండాది'' లేని అనాసక్తతను గొంతులో ధ్వనింపజేశాడు గురుసామి.

''దానిది యెగవపల్లె. దాని మొగుడు నీ మాదిరిగా నీళ్లు దాగేటోడు గాదు. వానికి పొద్దుపుడ్తే కల్లంగడి వానితో రగడ. పొద్దుబోతే పెళ్ళాంతో రగడ. ఈ మనిసి మాత్తరం బలే మానస్తురాలు. దినామూ కట్టెలు కొట్టుకోని బండ్లో తిరుపతి కేసుకోని బోతా వుండాది.''

''నిజవే. కట్టుమోపు బండ్లో తిరపతి కేసుకోని బొయ్యేదంటే సిన్నపనిగాదు. వాచర్ కాన్నించి, పారెస్టర్ కాన్నించి, రైలుబాట్లో గాంగీవాని కాన్నించి టేసన్లో పాయింట్‌మేన్, స్టేషన్ మేస్త్రి, టీచీ, గారుడ్లు, డ్రయివరు, పోలీసోడు... ఒకరుగాదు. ఎందరి దగ్గర వొదుక్కోని బోవాల. ఇంతా చేసిపోతే అదేందో స్కోతంట. వాడు స్టేషన్ మేస్త్రిక్కూడా బయపడేటోడు గాదంట. వాడు ఏడున్న కట్లుబెరికి తిరుపతి టేసన్లో ఏలమేసిస్తాడంట! ఇట్టాంటి పాటుకు బడేదానికి ఎవిరికిజెల్లు! అరవమాలోల్లకి జెల్లు. అట్టాడిది రైతులింట్లో పుట్టిన ఆడమనిసి నిబ్బరించుకోని వస్తా వుందంటే అది సిన్న పని గాదు'' తెల్లటి కళ్ళను మరింతగా తెరచి మెచ్చికోలుగా అన్నాడు గురుసామి. అతడు ఆమె కనుచూపు దాటిపోయేటంత వరకూ అలా చూస్తూనే వున్నాడు.

మేకలు కొండ వాగును సమీపించాయి. అవి గట్టుపై వరుసగా నిలబడి చల్లటి కొండవాగు నీళ్లు తాగసాగాయి. అర్జునుడూ, గురుసామి ముఖమూ, కాళ్ళూ కడుగుకొని కానుగచెట్ల నీడలో సేదదీరారు. సెలయేటి సవ్వడి. మేకల అరుపులు తప్పించి కోనంతా నిరామయంగా వుంది.

వారిద్దరూ అరచేతిలో తీంట్ర ఆకుల విస్తరిలో సంగటి పెట్టుకుని ఆవురావురుమంటూ మింగసాగారు. ఎక్కడినుంచో రెండు కాకులు వచ్చి వారి ప్రక్కన వాలాయి. అవి ''కా కా'' అంటూ కర్ణకఠోరంగా అరవసాగాయి. అర్జునుడు పదే పదే వాటిని చీదరించు కోసాగాడు. మేకలు చెవులూ, తోకలూ కదిలిస్తూ చెట్ల నీడలో నిశ్చలంగా నిలబడి వున్నాయి.

భోజనం చేసి వారు కడుపునిండా నీరు త్రాగి బ్రేవ్‌మంటూ తేన్చారు. అర్జునుడు వక్కాకు దంచి నోటిలో వేసుకొని నమలసాగాడు. గురుసామి బీడీ తాగుతూ సాలోచనగా అర్జునుడివైపు చూశాడు.

''ఏవిరా గురుసామీ... నీ మాదిరిగా కాళ్లూ సాంచేస్తే నాకు జరగద్దా? నాలుగు కట్టె పేళ్ళు చీల్చకబొయ్యి ఊరి ముందర నిలబెడ్తే నాలుగో అయిదో వస్తాది. రాతిరికి బత్తెం జరగతాది. నేను అగ్గో ఆ పెంటలోకి బొయ్యి నాలుగు సిగర మొక్కలు

కొట్టుకొస్తా. నువ్వు మాత్తరం నా జీవాల్ని గూడ అట్ట అదిలిస్తా వుండు. ఏమారినావో మెకం నమ్మకంగా ఏదోవోక పిల్లను నమిలేస్తుంది. పొయ్యినాక నోరు కొట్టుకోని ఫలము లేదురా'' అంటూ పదే పదే జాగ్రత్త జెప్పి పొదల్లోకి దూరి పెంటలోకి మాయ మయ్యాడు.

★ ★ ★

గురుసామి మేకలను తోలుకుని మంగలోడి దోనైవైపు సాగబాగరాడు. నడుస్తూ అతడు మాటిమాటికి కలియజూడసాగాడు. ఆకులు సరసరమని కదిలిన చోటల్లా అతడు చూపు నిలుపుతున్నాడు. మేకలు టపటపా ఎండుటాకుల్ని తొక్కుతున్నప్పుడల్లా అతడు కంగారుపడిపోతున్నాడు.

''దాని తోకే నా మూరతో వొకటిన్నర మూరకు తక్కవుండదు.''

''ఆవుగొడ్డట్టాదాన్ని అలగ్గా ఎత్తేస్తాది''

''దానికుండే నేకు కుందెలికీ లేదు కుర్ర పందికీ లేదు'' అర్జునుడి మాటలు అతని చెవుల్లో గింగిర్లు తిరుగుతున్నాయి. అతడు తానొక సాహసయాత్ర చేస్తున్న అనుభూతిని పొందుతున్నాడు! ఏ క్షణాన్నైనా మాయదారి మృగం మేకపిల్లపై పడవచ్చునని అతడు పదే పదే పరాకు చెప్పుకోసాగాడు.

ఇంతలో జెముడు పొదల్లో ఏదో జర జర కదలినట్లుయింది. తర్వాత సీకి చెట్లల్లో ఏదో సరసర ప్రాకినట్టయింది. ఉండివుండీ బలమైన శ్వాస విన్పించసాగింది. సవ్వడి ప్రక్కనున్న గుబుర్లలోకి జరిగినట్టయింది.

గురుసామి చేతిలోని మచ్చు కత్తిని బిగించాడు. అతడి ముఖం జేవురించి వుంది. అతడు ఊపిరి బిగించి వున్నాడు. శరీరం యావత్తూ బిర్ర బిగుసుకుపోగా అతడు అతి జాగ్రత్తగా నడవసాగాడు. పెద్దగా అరుస్తూ నల్ల మేకొకటి గురుసామి కాళ్ళ కడ్డం బడుతూ అవలికి పారిపోయింది. అతడు ప్రక్కనున్న దేవదారు చెట్టు మొదల్లో నిలబడి నలువైపులా పరిశీలనగా చూడసాగాడు. ఇంతలో అతనికి రెండు గజాల దూరంలో ఏదో దభిల్లున పడింది. గురుసామి నిర్ఘాంతపడి చెట్టుపైకి చూశాడు.

ఒకగంట క్రితం నేరేడుమాను చెలమ దగ్గర వాగు దాటుతూ వుండిన ఎర్రచీర ధరించిన స్త్రీ సివంగి వలె కొమ్మ నుంచి కొమ్మకు ఎగబ్రాకుతూ వుంది.

ఆమె గురుసామికేసి నిశ్చలంగా జూస్తూ వుంది. ఏదో మాట్లాడడానికన్నట్టుగా నోరు మెదిలించి, నోటిలోని వక్కాకును వుమియడానికి యిష్టపడని దానిమల్లే ముఖం

తిప్పుకుని ప్రక్కనున్న ఎండు కొమ్మను కత్తితో కొట్టసాగింది. వేటు వేటుకూ కొమ్మ పేళ్ళు పేళ్ళుగా లేస్తోంది.

తానున్నది నిర్జనారణ్యం అన్న ఉదాసీనత వల్ల గాబోలు ఆమె తన వస్త్రధారణపై అతి తక్కువ శ్రద్ధ వహించినట్టుంది. ఆమె కట్టుకున్న చీర మొలచుట్టూ బిగిసి చిన్న కచ్చడంలా వుంది. ఆమె నల్లగా, ఎదకొచ్చిన ఎనుములా నిగనిగలాడుతూ వుంది. ఆమె చెట్టు తమరలో కాసిన పనసపండులా కొమ్మమీద భారంగా కూర్చొని వుంది. ప్రవాహానికి అడ్డంగా వేసిన యిసుకమేట అంతకంతకూ ప్రిదిలిపోతున్నట్టుగా ఆమె రైక అసహాయంగా వుంది. ఆమె అడవిలో మృగతుల్యుడై తిరుగుతున్న మానవుల్ని కటాక్షించడానికి దేవదారు కొమ్మపై వెలసిన ఆదిశక్తిలా వుంది.

గురుసామి అచేతనుడై ఆమెకేసి చూడసాగాడు. కొమ్మ విరిగి క్రింద పడటంతో ఆమె వెనుదిరిగి క్రిందికి దిగసాగింది. గురుసామికి వుండీ వుండీ మేకలు అరుస్తున్న అరుపులు విన్పించడం లేదు. ఆమె దిగుతూనే వక్కాకు వుమ్మేసి వగరుస్తూ చెట్టు బోదెనానుకొని చేరిగిలపడి పోయింది.

రెండు నిముషాలు గడిచాయి. గుడి ముందు నిలుచున్న నందిలా గురుసామి శిలాసదృశంగా నిలబడే వున్నాడు.

చివరికామె తెప్పరిల్లి నోరు తెరచింది. ఆమె పెదవులు ఎండి అక్కడక్కడా ఎర్రగా చీలి వున్నాయి. దోపుబోయిన విగ్రహానికి మల్లే ఆమె ముక్కూ, చెవులూ బోసిగా వున్నాయి. ఆమె మెడలోని బొట్టు దారం నల్లగా మాసి నామమాత్రంగా తెగిపోవడానికి సిద్ధంగా వుంది.

''ఏవి ఎండ కాస్త వుందో చూడు. దరిద్రపు ఎండ. బీదాబిక్కీ, కూలీనాలీ ఈ వడకు బతికి బట్ట కట్టేట్టుగా లేదు. మాయదారి ఎండ - దీనికి దూముతగల్నాని'' శపిస్తున్నట్టుగా అంది.

శాపం తగిలిన రాక్షసుని హాహాకారంలా ఎక్కడో స్టేషన్లో రైలు భీకరంగా కూత వేసి ఆగింది.

''ఏవి జేసి సచ్చేది. ఈ బండికి పోదామని ఆ కాడికీ తెల్లారిజామున ఎల బారొచ్చినా, ఎర్రికాలవ నుంచీ నక్కలబండ దాకా అరవోళ్ళు అడివి అడివంతా బీడు జేసేసినారు. కడసారకి కలబందలు మిగిలించేటట్టు లేరు యెద నాబట్లు...'' ఛీత్కారంగా విదిలించేస్తూ లేచి ఆమె కొమ్మకున్న ఆకులు చెలగి మోపుకట్ట సాగింది.

తరవాత ఆమె గురుసామి కేసి పరిశీలనగా చూస్తూ, ''అర్జున్ రెడ్డితో స
పోతావున్న వాడివి గదా నువ్వు'' అంటూ నవ్వి తలపంకిస్తూ, ''బద్రం - పెద్ద న
తిరగతా వుండాది. మద్దేనం బండి పోకముందు గుండాలమిట్ట మొదట్లో దిగవ పెంట్లో
పోతావునింది'' అంటూ లేచి స్వగతంగా, ''యిట్టాటిది యింకొక మోపన్నా కావాల
అనుకుంది. మోపును నెత్తిమీద పెట్టుకొని ఆమె పశ్చిమ దిక్కుగా అడవిలో
నడవసాగింది.

ఆమె అలా కట్టెను మోపు కట్టుకుని తన ముందు నుంచీ వెళ్ళిపోవడం త
సర్వస్వాన్నీ దోచుకబోయినంతగా విలవిలలాడిపోయాడు గురుసామి. అడుగు దీ
అడుగు వేస్తున్నప్పుడు కదులుతున్న ఆమె కండల్ని, నడుస్తున్నప్పుడు హొయలుగ
కదులుతున్న ఆమె నడుమునూ తమకంతో చూడసాగాడు గురుసామి. అతడల
చూస్తూ వుండగానే ఆమె చెట్ల మధ్య మాయమయ్యింది.

అనంతరం అతడు మంత్రముగ్ధుని వలె ఆమె పోయిన దిక్కుగా నడవసాగాడు
వెనుదిరిగి జూడకుండా ఆమె నడిచీ నడిచీ ఒక బాగి చెట్టు దగ్గర ఆగింది. నేలమీ
కందుతున్న కొమ్మను కత్తితో నరకసాగింది. గురుసామి మెల్లగా వెళ్ళి ఏమాత్రం వెనక్కి
తిరిగినా తనకు తగిలేటట్టుగా బాగా దగ్గరగా ఆమె వెనుకగా నిలుచున్నాడు. అతడి
శరీరం కంపిస్తూ వుంది. అతడి శ్వాస బలంగా వుంది.

ఆమె సర్రున వెనుదిరిగి జూసింది.

ఆ హఠాత్పరిణామాన్ని ఎదుర్కోవడానికి ఆమెకు మరికొన్ని క్షణాలు పట్టింది.
క్రమంగా ఆమె కళ్ళల్లో ఎర్రజీరలు వ్యాపించాయి. ఆమె పెదవులు వొంకర్లుబోయాయి.
ఆమె ముక్కుపుటాలు అదురుతున్నాయి.

''ఎట్టుండాది వొళ్లు. మీది మీది కొస్తా వుండావు. నాతో పెట్టుకోవద్దు. మొదులే
నా నోరు మంచిదిగాదు...'' తీవ్రమైన కోపం, కించిత్ భయమూ మిళితంకాగా అంది.

గురుసామి వంక అనుమానంగానూ, క్రోధంగానూ చూస్తూ మోపు కట్టుకో
సాగింది.

''అర్జునుడు మొన్న జెప్పినాడులే నీ దయిర్నం గురించి. మనిషి తోడులేంది
మొగదల కోనలో నుంచీ యింటికాడికి పోలేనిటోడివి. ఆడదానిమీదకు ఎగబడతా
వుండావు గదరా!'' అని మోపు కదిలించి, అది బరువుగా తోచడంతో, ''ఇట్ట అగ్గిబడి
ఈ మోపు కొంచెం నెత్తిమీది కెత్తుదువురా! గూబ మాదిరి మళ్ళ జూద్దువుగాని'' అంది.

గురుసామి మోపును ఆమె తలమీది కెత్తాడు. అలా ఎత్తడంలో అతని ముఖం నడుము క్రింద ఆమె చీరను రాచుకుని పొత్తి కడుపు మీదినుంచీ గుండెల మధ్యగా లేచి, ముందుకు వాలి ఆమె చెంపను సుతారంగా రాసుకుంటూ పోవడం పూర్తిగా యాదృచ్ఛికం కాదు.

అప్పుడామె ''ఊ... ఊ'' అంటూ తత్తరపడడం... నెత్తిమీదికొచ్చేస్తున్న అవాంఛ నీయమైన పరిస్థితిని ఎదుర్కోడానికన్నట్టుగా వుంది.

మోపు నెత్తికెత్తుతూనే ఆమె గిరుక్కున తిరిగి నడిచిపోసాగింది. ఆమె పడగ దించుకొని పుట్టలోకి పోతున్న పాములా అడవిలోకి అదృశ్యమైంది. మలుపుల్లో ఆమె తనకేసి భయం భయంగా చూడడం గుర్తించాడు గురుసామి. ఆ చూపు పులి పంజాను తప్పించుకొన్న జింక చూపులా వుంది. నక్క నోరు దప్పిన మేకపిల్ల చూపులా ఉంది.

గురుసామి మళ్ళీ కొంతసేపు అచేతనంగా నిలబడిపోయాడు. ''మోపునెత్తి తలమీద పెట్టుకోలేని ఆడది తనను ఎంత మాట అనింది'' గురుసామి ముఖం జేవు రించింది. ''ఏమయినా దీన్నిపొద్దు వొదిలేదు లేదు'' గురుసామి మళ్ళీ ఆమె వెంటబడ్డాడు.

ముందూ వెనుకగా వారలా కొంతసేపు నడిచారు. ఆమె గబగబా నిలవకుండా అతని చేతికందకుండా దాదాపు పరుగులాంటి నడకతో నడచిపోతూనే వుంది.

''ఛత్ చేతికందినది తప్పించుకొనింది గదా'' పదేపదే ఖేదపడుతూ వేగం హెచ్చింపసాగాడు గురుసామి. ఆమె ''చెంగులు గాడి జర్తె''ను సమీపిస్తోంది.

గుండాల మిట్ట నుంచీ మంగలోడిదోనె వైపు వెళ్లే కొండదారి. చెంగులుగాడి జర్తెను చుట్టిపోతుంది. దాదాపు ఇర్వై గజాలున్న ఆ జారుడు బండను మామూలుగా ఎవరూ దాటడం జరగదు. అడవిలో కొచ్చే కొంటె కోణంగి పశువుల కాపర్లు కూడా ఆ సాహసానికి ఒడిగట్టరు. ఎప్పుడో ఓబి కాలంలో ''చెంగులుగాడు'' అనబడేవాడు జర్తెను దాటుతూ జారిక్రింద నున్న జెముడు చెట్లమీద పడి చనిపోవడంతో దానికా పేరు వచ్చిందని చెప్పుకొంటారు.

యథాలాపంగా ఆమె జర్తెనే చుట్టివచ్చే దారి వెంబడి నడవసాగింది. ఒక క్షణం ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చినవాడికి మల్లే గురుస్వామి జర్తెను దిగసాగాడు. సన్నగా, పట్టుదప్పితే పది బారలు క్రిందికి జారేట్టుగా వున్న ఆ బండను అతడు జాగ్రత్తగా దిగుతున్నాడు. నల్లగా, నున్నగా మెరుస్తూ వున్న ఆమె దేహకాంతి అతన్ని

అనుక్షణం వూరిస్తూ వుంది. అంతలో ఆమె తననొక వాజమ్మను చేసి తప్పించుకోవడం అతన్ని క్రోధోన్మత్తున్ని చేస్తోంది.

అతడు ఆ వాలును కుర్రపందిలా ఒడుపుగా దిగుతున్నాడు. గుంత నక్కలా ఒంగి ఒంగి దిగుతున్నాడు. రెక్కను కాలుతో వెనగ్గా ఈడ్చి పట్టుకుని పెట్టను వెంటాడడానికి దిబ్బను చుట్టి వస్తున్న కోడి పుంజులా దిగుతున్నాడు.

చిట్టచివరకు ఎలాగైతేనేం అతడు ఆ జారుడు బండను జయప్రదంగా దిగేశాడు. దారిప్రక్కగా చెట్టుమాటున నిలుచున్నాడు. పెద్ద నక్క తోకతో చెట్టును చుట్టు కున్నట్టుగా అతడు ఎడమ చేతితో చెట్టు బోదెను కౌగిలించుకొని నిలుచుని వున్నాడు. ఊపిరి బిగపట్టి చెవులు రిక్కించి అతడు ఎదురుచూడసాగాడు. అతని కళ్ళు చురుగ్గా పనిచేస్తున్నాయి.

చెట్టు వెనుక ఆకుల గలగల.

ఎక్కడో మేకలు అరుస్తున్నాయి.

గూబ గుయ్యిమనేట్టుగా కీచురాళ్ళ రొద.

మొగదలపెంటలో ఎవరో కట్టెలు కొడుతున్న శబ్దం. గురుసామి కాలాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో కొలుస్తున్నాడు.

రెండు పిట్టలు ఒకటి వేరొకదాన్ని తరుముతుండగా పెద్ద రభస చేస్తూ కొమ్మల మధ్య ఎగిరిపోయాయి. గురుసామి చెవులు రిక్కించి కళ్ళు మిటకరించి, పళ్ళు గిటకరచి, ఊపిరి బిగపట్టి కాళ్ళతో వేర్లు తన్నుకొని అప్రమత్తుడై వున్నాడు.

బలంగా గసపోస్తూ మనిషి వస్తున్నట్లయింది. తల వోరగా వాల్చి చూశాడు గురుసామి. వేసవిలో సైతం ఎర్రగా చిగిర్చిన చెట్టులా ఆమె డొంక దిగివస్తూ వుంది.

మరికొన్ని సెకండ్లు గడిచాయి. దగ్గరకు వస్తూనే చిరుతలా ఆమెపైకి లంఘించాడు గురుసామి. ఆమె తలమీది కట్టెల మోపు పట్టుదప్పి విరుసుకబోయి పడిపోయింది.

సరిగ్గా అదే సమయానికి పెద్ద నక్క గురుసామి వదిలేసివచ్చిన మేకల్లో అర్జునుడి మేకను వొడుపుగా పట్టి గొంతు కొరికి ఈడ్చుకొనిపోతూ వుంది. మిగిలిన మేకలు గుండాల మిట్ట దగ్గరజేరి కాపరిజాడ కానక బేలగా అరుస్తున్నాయి. మరో పది నిముషాలు గడిచాయి.

తుమ్మమొద్దులా తనమీద పడున్న గురుసామిని ప్రక్కకు దోసి అతి కష్టం మీద లేచి నిలబడింది. ఆమె నీళ్ళు నిండిన కళ్ళతో గురుసామి వంక అసహాయంగా జూస్తూ

వుంది. గురుసామి భయం భయంగా ఆమెకేసి చూస్తున్నాడు. ఆమె పదేపదే నిట్టూరుస్తూ మరికొంతసేపు అలాగే కూలబడిపోయింది. తర్వాత లేచి ముడులు విడిన మోపును బిగించింది. సర్రున ముక్కు చీది కొంగుతో కళ్ళూ, ముక్కూ తుడుచుకుంది. కొంగుతో చుట్టజేసి నెత్తిమీద పెట్టుకొంది. శరీరం వణికిపోతుండగా చేతుల బలవంతాన ఆమె మోపు నెత్తి తలమీద పెట్టుకొంది. పెట్టుకొంటున్నప్పుడు ఆమె మేను బండరాయి పడ్డ తీవెలా కంపించిపోయింది. ఒక క్షణం ఆమె మోపును తన మీదే వేసుకొని పడిపోతుందేమో ననిపించింది. కాళ్ళు ఒకదానికొకటి అడ్డం పడుతుండగా గురుసామి ఆమె వంక అచేతనంగా చూస్తూ వుండగానే చెట్ల మధ్య మాయమయ్యింది.

తాను ఎంతసేపలా నిర్వీర్యంగా పడి వున్నాడో గురుసామికి తెలియదు. తర్వాత అతడు లేచి లేని గాంభీర్యం తెచ్చుకుని బొంగురు గొంతుతో ''టిర్ర్, చ్చె చ్చె చ్చె'' అంటూ రకరకాల శబ్దాలు చేస్తూ మేకలకు తన వునికిని తెలియపరుస్తూ గుండాలమిట్ట వేపు నడవసాగాడు. దూరంగా మేకలు అరవడం విన్పిస్తోంది. దాదాపు ఆరు గంటల ప్రాంతంలో గురుసామి మేకలను కలుసుకొన్నాడు. గబగబా అతడు తన మేకలన్నీ వున్నదీ, లేనిదీ చూసి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. కానీ అర్జునుడూ అతని మేకలూ కన్పించకపోవడంతో అతని ముఖంలో భయాందోళనలు అలముకున్నాయి. అతడు మేకలనదిలిస్తూ నూరు రాళ్ళ త్రోవన బొంతల గుట్ట దిగసాగాడు. మేకలు పింటికలు వేస్తూ ఒకదాన్నొకటి రాచుకుంటూ, అరచుకుంటూ దిగుతున్నాయి.

★ ★ ★

''ఈ పొద్దు మానానికి ఈ యిరవదాకా పళ్ళు దోమలా. వాడు పెద్ద బొండమానాల నామీద పడేటాళకు నాకు కళ్ళు బూసులు కమ్మేసినాయి. ఏ మాత్తరం నాకు వొళ్ళులో పట్టు వుండినా వాడు నా మోకాలిమీది ఎంటిక పెరికేటోడేనా...'' గొంతు కూచొని హృదయ విదారకంగా విలపిస్తూ వుంది ఎల్లమ్మ.

''గొమ్ముండు సెల్లే! వాడు రానీ, నా కొడుకు ఈ పొద్దునాడు జేసిందానికి వాన్ని నేను మన్ను దినిప్పించకపోతే నా పేరు అర్జునుడే కాదు. బద్రంరా పోయినాక నోరు కొట్టుకొని లాభం లేదురా అని నేను సిలక్కు జెప్పినట్టుగా జెప్పేసిపోతే - వీడు ఈ సింగిరి పింగిరోడు నా మేకను నక్క నోట్లో ఏసేసి - నిన్ను - ఆడదాన్ని పరాయి మొగోడు కట్టుకున్నెదాన్ని తెల్లారినుంచీ సద్దినీళ్ళు నోట్లో పొయ్యకుండా కడుపాత్తరం కోసం

కానరాని కోనలోకొచ్చి కట్టెలు కొట్టుకునేదాన్ని - ఈ మాదిరిగా పాపం పోసుకున్నేడు గందా! రానీ నాయాలు వాడ్ని ఈ పొద్దు ఏం జేస్తానో సూడు...'' అర్జునుడు పేట్రేగిపోతున్నాడు.

''వీడి మూలంగా గాకపోతే ఈయాళకు నేను ఊర్లోవునుండునా! ఈ ఎదవ నా కొడుకు వమూలంగా గాకపోతే నేనీ పొద్దు ఈ ఫారెస్టోని సేతికి చిక్కుదునా? బంగారట్టామేక - అధ్వానం ఇన్నూరుకు తక్కువపోని మేక - కోస్తే పదారు వీశెలకు తక్కువ పడని మేక - వీని మూలంగా గాకపోతే నక్క నోట్లో ఏసేద్దునా. ఈ ఫారెస్టోడు జీవానికి ఎన్మిది లెక్కన నలభై జీవాలుకూ మున్నూటయిరవై కడ్తావా, లేదా అంటావుండాడు. ఏడ తెచ్చి కడ్తు? తూత్తెరే! ఈ పొద్దు రానీ వోడు వాని నన్నాపన్నా కీళ్ళు యిరిసెయ్యకపోతే నేను పచ్చికాలవ ఎంకట రెడ్డికే పుట్టినోన్నుగాదు...'' అర్జునుడు కోపంతో ఊగిపోసాగాడు.

బొంతల గుట్ట పాదం వద్ద, ఫారెస్టు డిపార్టుమెంటు వారు నాటిన సరిహద్దు రాయి వద్ద వారిద్దరూ ముడుచుకొని కూర్చొని తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. అనతి దూరంలోనే కానుగమాను క్రింద అర్జునుడి మేకలు వుద్ద తోలబడి వున్నాయి. ఇద్దరి కట్టెల మోపులూ చెట్టు బోదెకు ఆనించబడి వున్నాయి. గార్డు, మేకల నదిలిస్తూ ప్రక్కనున్న స్క్వాడ్ మెంబర్లతో మాట్లాడుతున్నాడు.

సివిల్ డ్రస్సులోనున్న స్క్వాడు మెంబర్లూ, వారి హెడ్డూ, రేంజరూ ప్రక్కనున్న చదును బండమీద కూర్చొని కొండను ఎగజూస్తున్నారు. మరికొందరు అడవిలో పసువుల కాపర్లు తెలివి మీరుతున్నవైనాన్ని, వన సంపదను ధ్వంసం చేస్తున్న తీరునూ, కట్టెలవాళ్ళు మోపును టవున్లో అమ్ముకుంటున్న వెలల్నీ గురించి కర్కశంగా మాట్లాడుకుంటున్నారు.

పడమట పొద్దు వాలుతోంది. చీకటి మబ్బులు ఆకాశాన్ని ఆక్రమించుకోవడం మొదలుబెట్టాయి. ఇంతలో స్క్వాడులో నుంచీ ఒకడు అర్జునుడి దగ్గరగా వచ్చి ''ఐతే ఏందియా నువ్వు జెప్పేది?'' అని కనుబొమలు యెగరేస్తూ నిలదీయసాగాడు.

అర్జునుడు లేచి చేతులు కట్టుకొని ''నేనేమి జెప్పినాను దేవరా. మిమ్మల్నని ఏవి పుణ్ణెం. ఈ పొద్దు నా టయిం బాగలే. మేపి మేపి బంగారట్టామేక్కు నీళ్ళొదిలేసి కడుపు కాలి వచ్చినోన్ని. ఈ మంద తప్పించి ఊర్లో సెంటుబూవి లేనోన్ని. సేతిలో రూపాయి కాసులేనోన్ని. ఇంట్లో మట్టి పెంకులు తప్పించి సత్తుబోకి లేనోడిని...

అప్పిటికి నా శక్తానుసారం జీవానికి అర్ధ రూపాయి లెక్కన నెలకు పద్దెదు రూపాయలు గార్డోనికి కడ్తావుండా. మీకు మేము కొత్తగా జెప్పేది ఏముండాది. సూసుకోని ఏసుకోండి'' అర్జునుడు పట్టకమల్లాడుతున్నాడు.

''తెల్లారి నుంచీ నోట్లో పచ్చి మంచినీళ్ళు బొయ్యలేదు సామి. ఈ పొద్దుటికి వొదిలేయి'' ఎల్లమ్మ గింజుకోసాగింది.

''ప్రతిరోజూ పొయ్యి టవున్లో ఇరవైగ్గా ముప్పైగా అమ్ముకుంటారు. ఈ పొద్దు రేంజరింట్లో శుభకార్యానికి ఒక మోపు యిచ్చే దానికి ఏందో ఊరికే యిచ్చినట్టు మూలగతా వుండారు. ఆయన సూసీ సూడకుండా పోబట్టి మీరు కూడా వొక బతుగ్గా బతగతా వుండారు. సరిపోయింది. మీ న్యాయం మీకే సరిపోయింది గదా'' ఎకసెక్కంగా మాట్లాడుతూ విసవిసగా అతడు దూరంగా నడచిపోయాడు.

రేంజరు ప్రక్కనున్న గార్డుతో ''ఏవయ్యా ఎంతసేపయ్యింది నువ్వు వాచ్‌మేన్‌ను తోడిచ్చి యిర్లవాళ్లని పంపి, వాళ్ళింకా రాలేదు. యింకా గోట్స్ వస్తాయంటూ వుండావు. ఈ పొద్దే వచ్చేస్తా యంటావా. 'టుమారో ఆఫ్టర్‌నూన్' పట్టునా'' అంటూ గద్దించాడు.

''వస్తారు సార్. అదిగో ఆ బండ క్రింద మేకలు దిగుతున్నాయి చూడండి. యిర్లోళ్లు గూడా వచ్చేస్తారు. యిర్లవానిది విరుగుడులేని గురి అంటారండి. గంటకు ముందే టుపాకీ శబ్దం మీరే విన్నారుగదా. కుందేలో, పందో లేకుండా వారు కొండ దిగితే అడగండి'' అన్నాడు గార్డు.

వారలా చూస్తూ వుండగానే మేకల అరుపులు దగ్గరబడ్డాయి.

''అయిగో అయి గురుసామి మేకలే. రానీ నా కొడుకు. కుశాలగా వస్తా వుండాడు. ఈడ యముడు వచ్చి కూసోనుండే సంగతి తెల్లే. రానీ ఈ పొద్దు...'' అర్జునుడు లేచి లేచి కూర్చోసాగాడు.

ఇర్లవాళ్ళు వేటను పెద్ద కొమ్మకు కట్టి తెస్తున్నట్టున్నారు. వెనుకగా ఇద్దరు ముగ్గురు కట్టెలవాళ్ళూ, వారి వెనుకగా వాచ్‌మేన్ వస్తున్నారు.

'కణతి' కాదు 'అడవి పంది' 'రానీండి చూద్దాం' 'ఎంత పందెం' అంటూ స్క్వాడు మెంబర్లు నోళ్లు వూరించుకోసాగారు. ఇర్లవాళ్ళు దగ్గరికొచ్చి బరువు దించారు. గురుసామి మేకలు అర్జునుడి మేకలతో కుశలప్రశ్నలు వేస్తున్నాయి.

''ఎవడు వీడు?'' రేంజరు కట్టెకు కట్టి తెచ్చిన మనిషి కాయం జూస్తూ ప్రశ్నించాడు.

''బతికే వుండాడా'' అంటూ గార్డు వంగి పరిశీలనగా చూసి పెదవి విరిచాడు.

ఇర్లవాడు ''వీడు గురుసామని ఈ పేటలో వుండేవాడే సామీ. చెంగులుగాడ్ జర్రెకాడ కుందేలిని కాలిస్తిని. పొదల్లోకి ఎతకతాబోతే ఈడు గోరస్తా వుండాడు. ఈ కట్టెలోళ్లు గూడా ఆడ్నే వున్నారు'' అన్నాడు.

''అవును సామి, ఎప్పుడు పడినాడో ఏమో మూలగతావుంటే మేము పోయి సూస్తిమి. ఆ యిరవకు వీడు మన లోకంలోనే వుండె. ఏవిరా పాపాత్ముడా, ఎందుకు దాటినావురా జర్రెని. అంటిమి. ''కింద పారెస్టోళ్ళని జూసి భయపడి కోనలోకి దాటుకుందామనుకొంటినిరా'' అని కళ్ళనీళ్ళు యిడిచేసినాడు'' కట్టెల వాళ్ళు నీళ్ళు ఉబుకుతుండగా అన్నారు.

అక్కడున్న మనుషులందరూ శవం చుట్టూ చేరిపోయారు. అర్జునుడు కాయాన్ని పరిశీలనగా చూసి ముఖంలో రంగులు మారుతుండగా తల దగ్గర కూర్చొని ''ఫారెస్టోళ్ళకి బయపడి జర్రె దాటి సచ్చినావు గదరా. జీవానికి పాలుమారి యిరగపడి నచ్చినావుగదరా'' అంటూ విలపించసాగేడు.

''సత్తేపమాణెంగా వీడు జర్రె పడి సచ్చినాడు దేవరా. నా టుపాకీ దెబ్బకు గాదు. కావాలంటే గుడ్డలూడపెరికి సూడండి. దెబ్బ తగిలుంటే నన్ను కూడా కొరత వెయ్యండి'' అంటూ యిర్లవాడు రేంజరు కాళ్ళ దగ్గర కూలబడ్డాడు.

నల్లటి కొండ కొమ్ము పై నున్న తెల్లని జర్రె, మేకపిల్లను వెంటాడుతున్న పెద్ద నక్కలా క్రూరంగా, ఎల్లమ్మను వెంటాడుతున్న గురుసామిలా ఉన్మత్తంగా అడవిలో కెళితేగానీ భుక్తిగడవని పశువుల కాపర్ల దగ్గర, కట్టెలవాళ్ళ దగ్గర దొరికినకాడికి డబ్బులు గుంజడం కోసం మాటువేసి వున్న ఫారెస్టు ఉద్యోగుల తండాలా, నిర్దయగా, ఒకరినొకరు వేటాడుకొనే పరిస్థితిని కల్పిస్తున్న సమాజపు భయంకర గహ్వారం నుంచి వ్రేలాడుతున్న విషపునాలికలా, కొండ క్రింద జరుగుతున్న తతంగాన్ని చూస్తూనే వుంది.

---

★ జర్రె - జారుడు బండ. జర్రెలమీది నుంచి పశువులు, మనుషులు జారిపడడం - చనిపోవడం తరచూ అడవుల్లో జరిగే విషయం.

*(21-1-82 ఆంధ్రజ్యోతి వారపత్రిక)*